www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 21 సెప్టెంబర్ 2025



23న చలో విజయవాడ

ప్రజాశక్తి - కడప అర్బన్
రాష్ట్రవ్యాప్తంగా అన్ని రకాల మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఈనెల 23న విజయవాడ అలంకార్ సెంటర్ వద్ద నిర్వహించే ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపిమున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజయభాస్కర్, నాగేంద్ర, జిల్లా కోశాధికారి గోపి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వంలోనూ, ప్రస్తుత ప్రభుత్వంలోనూ మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమ్మెలు నిర్వహించామని తెలిపారు. ప్రభుత్వాలు అనేక రకాల హామీ ఇవ్వడాన్ని పేర్కొన్నారు. హామీలు అమలు కాని పక్షంలో 23న విజయవాడ కార్యక్రమం నిర్వహించాల్సి వస్తుందని తెలిపారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని పేర్కొన్నారు.

భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలు

- 150 ఎకరాల్లో వరికి నష్టం
- లబోదిబోమంటున్న రైతులు
- నీటమునిగిన టమోటా, బెండ పంటలు
- పరిశీలించిన వ్యవసాయ అధికారులు



వేంపల్లె : అధిక వర్షాల కారణంగా నేలకూలిన వరి పంట

ప్రజాశక్తి - వేంపల్లె
ఐదు నెలల రైతన్న కష్టం రెండు రోజుల్లోనే ఆవిరైంది. చేతికి వచ్చే సమయంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు అక్కడక్కడ దాదాపు 150 ఎకరాల్లో నెలకూలింది. రైతులు లబోదిబోమంటున్నారు. వరి పంట నాట్లు వేసినప్పటి నుండి పంట చేతికి వచ్చే దాకా కంటికి రెప్పలా కాపాడి కొంటూ వచ్చిన రైతులపై వర్షం ప్రభావం పడడంతో వరి పంటతో పాటు టమోటా, బెండ, ఇతర పంటలు దెబ్బతిన్నాయి. రాత్రి సమయంలో రెండు రోజుల నుండి వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం రాత్రి వేంపల్లె మండల వ్యాప్తంగా భారీ ఎత్తున వర్షం కురిసింది. దీంతో వరి పంటలు నెలకూలడంతో పాటు టమోటా, బెండ పంటల్లో నీళ్లు నిలిచింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చే తరుణంలో వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులు అన్నదాతకు కలవర పాటుకు గురిచేస్తున్నాయి. ఈ ఏడాది మెట్టప్పు కింద వరి పంటను రైతులు సాగు చేశారు. సాగు చేసేందుకు ఖర్చులు కూడా తడిసి మోపెడు అయ్యాయి. వరి పంటకు ఎకరాకు దాదాపు రూ.30 వేల ఖర్చు చేసి పంటను కాపాడు కొంటూ వస్తున్న సమయంలో వర్షాలు దెబ్బ తీస్తున్నట్లు కుమ్మరాంపల్లెకు చెందిన రైతులు మధుసూదన్ రెడ్డి, రామాంజనేయరెడ్డి, శివారెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, వరలక్ష్మీ, వర్ధమ్మ, లక్ష్మీ నారాయణ, ఆంజనేయ రెడ్డి, రామాంజనేయమ్మ, రామచంద్ర, రవికుమార్ రెడ్డి, మల్లమ్మ, వీరాంజనేయరెడ వాపోయారు. వేంపల్లె మండల వ్యాప్తంగా దాదాపు 3 వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేసినట్లు సమాచారం. పాపాఘ్ని నది పరివాహక ప్రాంతంలో ఉన్న ఇడుపులపాయ, వీరన్నగట్టుపల్లి, కుమ్మరాంపల్లె, అలిరెడ్డిపల్లె, వేంపల్లె, తువ్వపల్లితో పాటు ఆయా గ్రామాల్లో వరి పంటను రైతులతో పాటు కౌలు రైతులు సాగు చేశారు. వర్షాలు వల్ల ఎక్కువగా పెరిగిన వరి పంట ఆయా గ్రామాల్లో భారీ ఎత్తున నెలవాలింది. వరి పంట నెలవారడంతో పెట్టుబడి బూడిదలో పోసినట్లు అయ్యిందని రైతులు వాపోతున్నారు. కౌలు కూడా రానటి పరిస్థితి ఉందని కౌలు రైతులు అంటున్నారు. వర్షాలకు వరి పంటతో పాటు దెబ్బతిన్న ఇతర పంటలకు ప్రభుత్వం నష్ట పరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని అంటున్నారు.

రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు : ఎడి
వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నష్టపోయిన రైతులను ఆదుకుంటామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని పులివెందుల వ్యవసాయ శాఖ ఎడి ప్రభాకర్ రెడ్డి చెప్పారు. శనివారం మండలంలోని కుమ్మరాంపల్లె గ్రామ పరిధిలో వర్షం ధాటికి నెల కూలిన వరి పంటను, టమోటా, బెండ పంటలను మండల వ్యవసాయ అధికారి శివశంకర్ రెడ్డితో కలిసి పులివెందుల ఎడి ప్రభాకర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు భారీ వర్షాలకు దెబ్బతిన్న వరి పంట పొలాలను పరిశీలించి నివేదికలను తయారు చేస్తున్నట్లు చెప్పారు. రైతులకు పరిహారంలో తగిన న్యాయం చేస్తామని చెప్పారు. ఎవిఒ. సురేష్ తో పాటు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. భారీ వర్షాల కారణంగా వేంపల్లె మండలంలో వరి పంట పూర్తిగా నెలవాలిందని, కూటమి ప్రభుత్వం ఎకరాకు రూ 30 వేలు నష్ట పరిహారం రైతులకు అందించాలని రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కుమ్మరాంపల్లె గ్రామ సమీపంలో నెల కూలిన వరి పంటను, బెండ, వంకాయ, టమోటా తోటలను కాంగ్రెస్ నేతలతో పరిశీలించారు.

అరటి రైతుకు అపార నష్టం
ప్రజాశక్తి - వేముల : మండల కేంద్రంలోని స్థానిక పెద్ద జూటూరు గ్రామపంచాయతీలోని రైతు చప్పిడి శేషురెడ్డి సుమారు 4 ఎకరాలలో 6 వేల మొక్కలు అరటిపంటను సాగు చేసేవారు. శుక్రవారం రాత్రి కురిసిన అధిక వర్షానికి పంట మొత్తం నేలమట్ట మైందని బాధిత రైతు వాపోయారు. అరటి పంట సాగు చేయాలంటే ఎకరాకు రూ.లక్ష యాభై వేల వరకు పెట్టుబడి పెట్టాలని రైతు పేర్కొన్నారు. .కానీ తుపాన్లు, ఈదురుగాలులు వంటి ప్రకృతి వైపరీత్యాలు రాకపోతే పంట చేతికి వస్తుందన్నారు. కొనుగోలుదారులు కోసం రైతులు ఎదురుచూపులు చూసే పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు.



వర్షం ధాటికి ధ్వంసమైన అరటి తోట

కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలి

సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి
విద్యుత్ భవన్ ఎదుట కార్మికుల కుటుంబాలతో ధర్నా



విద్యుత్ భవన్ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు, వారి కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి - కడప అర్బన్
విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్నారని, వీరందరిని రెగ్యులర్ చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ సమీపంలో ఉన్న విద్యుత్ భవన్ వద్ద విద్యుత్ కార్మిక కుటుంబాలతో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో కార్మిక కుటుంబాలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా కోటి రూపాయలు ఇన్సూరెన్స్ కార్మికులకు ఇవ్వాలని కోరారు. 20, 25 సంవత్సరాలుగా పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను అందర్నీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. 2022 పిఆర్సి అరియర్స్‌ను రెగ్యులర్ ఉద్యోగులకు ఇచ్చిన విధంగా కాంట్రాక్టు కార్మికులకు కూడా ఇవ్వాలని తెలిపారు. కొత్త ఆదేశించడంలో పాత ఆదేశాలను సమానంగా జీతాలు ఇవ్వాలని, ఫీల్డ్ అసిస్టెంట్లు అందరినీ స్కిల్ చేసి స్కిల్ వేతనం ఇవ్వాలని చెప్పారు. ప్రతి సబ్ స్టేషన్‌లో నైట్ వాచ్ వినియోగించాలని, కార్మికులకు అనారోగ్యం పాలైన యాక్సిడెంట్ గురైన ఉచితంగా అన్‌లిమిటెడ్ హెల్త్ కార్డులను కార్మికులకు ఇవ్వాలని పేర్కొన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.10 లక్షలు ఇవ్వాలని అనేకసార్లు ప్రభుత్వం, యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అక్టోబర్ 6న ఎపిఎస్‌పిడిఎల్ తిరుపతి కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ డి.రమేష్, మైదుకూరు డివిజన్ కార్యదర్శి పి.సి. కొండయ్య, పులివెందుల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున రెడ్డి, మౌళి, పొద్దుటూరు డివిజన్ నాయకులు రవి, శేషయ్య, సంజీవరెడ్డి, కడప నాయకులు బాషా, నాగరాజు, పెద్దయ్య, మధుసూదన్ నాయుడు, సాయి, సుబ్బరాయుడు, రియాజ్ విద్యుత్ కార్మికులు అబ్దుల్ రఫీ, గిరి, సిద్ధారెడ్డి, గంగాధర్, కార్తీక్, గోపాల్ రెడ్డి, సుదర్శన్, యునైటెడ్ ఎలక్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ డిస్కాం అధ్యక్షులు ఎన్. శివశంకర్, జిల్లా ట్రెజరర్ సురేంద్ర, జిల్లా నాయకులు షరీఫ్, లెనిన్ బాబు, నాగ మల్లయ్య, విద్యుత్ కార్మికులు, రెగ్యులర్ ఉద్యోగులు పాల్గొన్నారు.

డిమాండ్లను పరిష్కరించేంతవరకు ఉద్యమం
కడప : విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల అన్యాయమైన డిమాండ్లను పరిష్కరించేంతవరకు పోరాటం ఆగదని విద్యుత్ ఉద్యోగుల జెఎసి రాష్ట్ర చైర్మన్ సానా కృష్ణయ్య హెచ్చరించారు. జిల్లా విద్యుత్ ఉద్యోగుల జెఎసి చైర్మన్ యు.ఎస్.కె. బర్నబాస్, కన్వీనర్ చలపతి ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కడప విద్యుత్ భవన్ ఎదుట విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు శనివారం చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు రాష్ట్ర జెఎసి నాయకులు తమ సంఘీభావాన్ని, మద్దతును తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ కార్మికులు, ఉద్యో గుల న్యాయమైన డిమాండ్ల పరిష్కార విషయంలో యాజమాన్యం తన మొండి వైఖరిని వీడనాడాలన్నారు. నాలుగైదేళ్లుగా విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కా రంలో విద్యుత్ సంస్థల యాజమాన్యం నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తుందన్నారు. ఈనెల 22న అన్ని జిల్లా కేంద్రాలలో శాంతియుత ర్యాలీ నిర్వహించి కలెక్టర్లకు వినతి పత్రం అందజేస్తామని, 25న విజయవాడలో సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు.

సమన్వయంతో జిల్లా అభివృద్ధికి కృషి

- కడప ఎంపీ వై.ఎస్.అవినాష్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప
కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, కార్యక్రమాలు పేదలకు సక్రమంగా అందించేలా ప్రజా ప్రతినిధులు అధికారులు సమన్వయంతో జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని కడప పార్లమెంటు సభ్యులు, జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ చైర్మన్ అవినాష్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్ హాలులో జిల్లా కలెక్టర్, దిశ మెంబర్ సెక్రెటరీ శ్రీధర్ చెరుకూరి ఆధ్వర్యంలో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమా వేశం నిర్వహించారు. సమావేశానికి రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే దాసరి సుధా, కడప నగర మేయర్ సురేష్ బాబు, జడ్‌పి చైర్మన్ ముత్యాల రామగోవింద రెడ్డి హాజరయ్యారు. ముందుగా కడప పార్లమెంటు సభ్యులు అవినాష్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాలను మాని టరింగ్ చేయడం కోసం ఈ దిశ కమిటీ ఏర్పాటైందని చెప్పారు. జిల్లా అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంగా పనిచేయాలని సూచించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఉల్లి ఎగుమతులకు అడ్డంకులు రావడంతో, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఉల్లి రైతులకు, వ్యాపారులకు ఎదురవుతున్న ప్రతికూల పరిస్థితులను అధిగమించే చర్యలను చేపడుతు న్నామన్నారు. ఉపాధి పనుల్లో సిబ్బంది అక్రమాలకు పాల్పడినా, తప్పుడు బిల్లులు, తప్పుడు మస్టర్ రికార్డులు నమోదు చేసినా వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారుఎఱ. కడప నగరంలో 21 వేల మంది పేదలకు హౌసింగ్ పథకం ద్వారా ఇళ్లు మంజూరు చేశారని, ఇంతవరకు గృహ నిర్మాణాలు అసంపూర్తిగానే ఉన్నాయని ఎక్కడ లోపం ఉందని కడప నగర మేయర్ సురేష్ బాబు సభ దృష్టికి తీసుకువచ్చారు. బి.మఠం, బద్వేలు మండల పరిధిలో కూడా పేదలకు మంజూరైన గృహాలు అసంపూర్తిగా ఉన్నాయని, పేదలు అవస్థలు పడుతున్నారని, త్వరితగతిన పెండింగ్ పనులను పూర్తి చేయాలని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధా కోరారు. ఎన్ఆర్ఇజిఎస్ ద్వారా మండల పరిషత్, గ్రామ పంచాయతీల్లో జరిగే అభివృద్ధి పనుల నిర్వహణలో రిజర్వేషన్ పద్ధతిని పాటిస్తూ సర్పంచులు, ఎంపిటిసిలు, జడ్‌పిటిసిలకు అవకాశం కల్పించాలని, పనుల ప్రతిపాదనలు వారి దృష్టికి తీసుకురావాలని జడ్‌పి చైర్మన్ రాంగోవిందరెడ్డి సభ అధ్యక్షులు దృష్టికి తీసుకువచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి దిశ కమిటీ సమావేశం అవుతుందని తెలిపారు. జిల్లాలో దాదాపు అన్ని గ్రామాల్లో 95 శాతంసిమెంట్ రోడ్లు పూర్తి చేశామన్నారు. మిగిలిన18 గ్రామాల్లో 250 జనాభా ఉన్న గ్రామంలో ఎన్ఆర్ఇజి ఎస్ పథకం కింద రోడ్లు పూర్తి చేస్తామ న్నారు.చెప్పారు. రైతులకు అత్యంత ఉపయోగకరమైన ఉద్యాన పంటలకు అవస రమైన మైక్రో ఇరిగేషన్ పరికరాలను అందిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో యూరియా స్టాకు ఈ సీజన్‌కు సరిపడ సమృద్ధిగా ఉన్నాయన్నారు. సమా వేశంలో దిశ కమిటీ సభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ చైర్మన్లు, మండల అధ్యక్షులు, జడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.



సమావేశంలో మేయర్, జడ్‌పి చైర్మన్, కలెక్టర్, ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు

ఓట్ల రక్షణ కోసం సంతకాల సేకరణ ఉద్యమం

ప్రజాశక్తి - కడప : ఓట్ల రక్షణకు కాంగ్రెస్ పార్టీ సంతకాల ఉద్యమాన్ని ప్రారంభించిందని కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ తెలిపారు. కడపలోని తన కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతదేశంలో ఓట్ల దొంగలు పడ్డారని ఆరోపి ంచారు. ఇటీవల లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కర్ణాటక రాష్ట్రంలోని అలందా నియోజకవర్గం, మహారాష్ట్రలోని రాజౌరి అసెంబ్లీ నియోజకవర్గంలో ఓట్ల దొంగతనం ప్రక్రియను సవివరంగా ప్రదర్శించారని తెలిపారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని భారతీయ జనతా పార్టీ తుడిచిపెట్టిందని ఆరోపించారు. కేంద్ర ఎన్నికల సంఘం చీఫ్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పూర్తి స్థాయిలో భారతీయ జనతా పార్టీ తో కుమ్మక్కై ఓట్ల దొంగతనానికి శ్రీకారం చుట్టినట్లు రాహుల్ గాంధీ పేర్కొన్నారని చెప్పారు. రెండవ విడతలో నిజమైన ఓటర్లను ఓ ప్రత్యేక సాఫ్ట్ వేర్ ద్వారా తొలగించే ప్రక్రియను ప్రదర్శించారని తెలిపారు. సంతకాల ఉద్యమం ద్వారా తమ ఓటును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఓట్ చోర్ గద్దిచోడ్ అనే కరపత్రాన్ని విడుదల చేశారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి : సిపిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలోని రిమ్స్ పరిధిలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అనేక సమస్యలు తిష్ట వేసి ఉన్నాయని, వాటి పరిష్కారానికి తక్షణమే జిల్లా అధికార యంత్రాంగం కృషి చేయాలని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని రిమ్స్ పరిధిలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో సిపిఎం ప్రతినిధి బృందం పర్యటించింది. ఈ సందర్భంగా రామమోహన్ మాట్లాడుతూ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సమస్యలకు నిలయంగా మారిందన్నారు. కోట్ల రూపాయల ఖర్చుపెట్టి నిర్మించిన ఆసుపత్రి సరైన సిబ్బంది లేక అనేక సమస్యలను ఎదుర్కొంటుందని తెలిపారు. 450 పడకల ఆసుపత్రిలో దాదాపు 10 మంది వైద్యులు, 140 మంది స్టాఫ్‌నర్సులు, ఎంఎన్ఒ, ఎఫ్ఎన్ఒ, ల్యాబ్ టెక్నీషియన్లు, వార్డు బాయ్స్ కొరత తీవ్రంగా ఉందన్నారు. కీలక విభాగాలైన ఎండోక్రినాలజీ, న్యూరాలజీ విభాగాలకు సంబంధించిన డాక్టర్లు లేకపోవడం ఇబ్బం దిగా ఉందన్నారు. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు అధికారులు ఈ ఏడాది మే 1న నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. ఈ నోటిఫి కషన్‌లో 19 పోస్టులు కాంట్రాక్టు పద్ధతిలో, 50 పోస్టులు అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియామకాలు చేపట్టేందుకు వీలుగా ఉందన్నారు. ఇప్పటివరకు దరఖాస్తులు స్వీకరించారే తప్ప మిగిలిన ప్రక్రియ అంతా ఆగిపోయిందన్నారు. దీని వెనక అధికార పార్టీ నేతల ఒత్తిడి ఉన్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఖాళీలన్నీ భర్తీ చేసి మెరుగైన వైద్యం అందించకపోతే సిపిఎం ఆధ్వర్యంలో పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చ రించారు. పర్యటనలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరి రెడ్డి, నగర కమిటీ సభ్యుడు కుమారస్వామిరెడ్డి, రామకృష్ణారెడ్డి, గోపాల కృష్ణయ్య పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణ రద్దు చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లాలోని జమ్మలమడుగు నియోజకవర్గంలో పెద్దముడియం, మైలవరం మండలాల్లో సోలార్ ప్రాజెక్టుకు రైతుల దగ్గర నుంచి బలవంతపు భూసేకరణ రద్దు చేయాలని ఈనెల 24న చలో విజయవాడ, మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు ఏపీ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా కార్యదర్శులు బి.దస్తగిరి రెడ్డి, అన్వేష్ తెలిపారు. శనివారం రైతు సంఘం జిల్లా కార్యాలయంలో చలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జమ్మలమడుగు నియోజకవర్గంలో కల్వటాల గోవిందపల్లి వద్దిరాల తదితర గ్రామాల్లో బలవంతపు భూసేకరణ ఆపాలని, 2013 భూ సేకరణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సోలార్ ప్లాంట్ యాజమాన్యం రైతుల దగ్గర బలవంతపు సేకరణ చేయడం, భూములు ఇవ్వకపోతే అక్రమ కేసులు నమోదు చేసి జైలుకు పంపడం చాలా దుర్మార్గకరమైందని తెలిపారు. లీజు పేరుతో రైతుల దగ్గర తీసుకున్న భూములు తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సోలార్ ప్లాంట్ లో భూములు కోల్పోతున్న గ్రామాలలో రస్తాలు కూడా ఆక్రమించుకోవడం చాలా అన్యాయమని చెప్పారు. గ్రామాలకు పోయే రహదారులను యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. రైతుల అనుమతి లేకుండా రాత్రి సమయాలలో బలవంతంగా గుంతలు తీసి స్తంభాలు ఏర్పాటు చేయడం సరైంది కాదని పేర్కొన్నారు. సోలార్ ప్లాంట్‌లో నష్టపోయిన బాధితులు బలవంతంగా భూములకు ఉంటున్న రైతులు విజయవాడలో జరుగుతున్న మహా ధర్నా కార్యక్రమంలో పెద్ద ఎత్తున సోలార్ బాధితులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు రామకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

విషాదం!

ప్రజాదృష్టి

ఉమ్మడి కడప జిల్లాలో ఇటీవలి ఘటనలు కలవరాన్ని కలిగించాయి. ఇటీవల పోరుమామిళ్ల మండలంలో ఈతకెళ్లిన ఓ యువకుడు గల్లంతు కావడం తెలిసిందే. శుక్రవారం రాత్రి రాయచోటి పట్టణంలో చోటుచేసుకున్న వర్షబీభత్సం బారిన పడిన నలుగురు మృత్యువాత పడడం భయాందోళన కలిగించింది. రాయచోటి ఘటనలో రెండు గంటల వ్యవధిలో 135 మి.మీ వర్షపాతం నమోదు కావడం ఊహించని పరిణామం. ప్రకృతి తీవ్రస్థాయిలో కన్నెర్ర చేసినప్పటికీ డ్రెయినేజీ కాల్వలకు కాంక్రీట్ మూతలు మూయడం, కల్వర్టుల దగ్గర మోరీలు, ప్రొటెక్షన్‌వాల్ ఏర్పాటు చేయడంలోని నిర్లక్ష్యమే నలుగురు ప్రాణాలను కోల్పోవడానికి కారణమని గ్రహించాలి. రాయచోటి జిల్లా కేంద్రం కావడంతో డ్రెయినేజీల సామర్థ్యాన్ని, లోతు, వెడల్పుల పరిమాణాన్ని పెంచినట్లు తెలుస్తోంది. ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం అంతులేని విషాదాన్ని నింపింది. కడప కార్పొరేషన్‌లో గత రెండేళ్లుగా డ్రెయినేజీల సామర్థ్యాన్ని పెంచారు. డ్రెయిన్ల ఆక్రమణల్ని తొలగించడం, లోతు, వెడల్పులతో కూడిన పనులు చేపట్టారు. రాయచోటి ఘటనల్ని గమనంలోకి తీసుకుని డ్రెయినేజీ వ్యవస్థలను ఆధునికీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వర్షాకాలం కావడంతో ఉన్నఫళంగా అతివృష్టి లాంటి ఘటనలు చోటుచేసుకునే అవకాశాలు ఉన్నాయనే సంగతిని మరువకూడదు. జిల్లా అధికార యంత్రాంగం ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలి. పెన్నా నదీ మీదుగా వెళ్తే సోమశిల వెనుకజలాలు రాజంపేట, బద్వేల్ నియోజకవర్గాలకు చెందిన ఒంటిమిట్ట, అట్లూరు, నందలూరు మండలాల పరిధిలోని లోతట్టు ప్రాంతాలను ముంచెత్తుతున్నాయి. సోమశిల వెనుకజలాల పరిధిలోని వేలాది ఎకరాల పంట మునిగిపోతోంది. బద్వేల్ నియోజకవర్గ పరిధిలోని అట్లూరు మండల పరిధిలోని ముంపు గ్రామాలకు వెళ్లే రహదారులు, బ్రిడ్జిలను సైతం వెనుకజలాలు ముంచెత్తుతున్నాయి. ముంపు పరిహారం కోసం దశాబ్దాల తరబడి నిర్వాసితులు నిరీక్షించాల్సిన దుస్థితి దాపురించింది. ప్రభుత్వం తక్షణమే స్పందించి జిల్లాలోని గండికోట, సోమశిల, పైడిపాలెం, చిత్రావతి వంటి సాగునీటి ప్రాజెక్టుల కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులను సత్వరమే ఆదు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఒంటిమిట్ట మండలంలోని తప్పెటవారిపల్లి, దవంతరపల్లి, పెన్నపేరూరు వంటి గ్రామాలను వెనుకజలాలు చుట్టుముట్టాయి. ఫలితంగా లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించుకున్న ఇళ్లలోనికి పాములు, తేళ్లు ఇతర విషకీటకాలు వెళ్తున్న ఘటనలతో గ్రామీణులు బెంబేలెత్తిపోతున్నారు. తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ నిర్వాసితులు ప్రజాసమస్యల పరిష్కార వేదికల చుట్టూ పలుమార్లు ప్రదక్షిణ చేస్తున్నప్పటికీ పరిష్కారానికి నోచుకోవడం లేదు. సోమశిల, బ్రహ్మసాగర్ రిజర్వాయర్ల కోసం ఇళ్లు, భూములు సహా సర్వం త్యాగం చేసిన వారిలో వందలాది మంది అర్హులకు ఉద్యోగాలు ఇస్తామని చూపించిన హామీ నేటికీ అమలుకు నోచుకున్న దాఖలాల్లేవు. ప్రభుత్వం స్పందించి నిర్వాసితులకు పరిహారం చెల్లింపులు, అర్హులైన వారికి ఉద్యోగాలు హామీని అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కెవికెలో ఘనంగా మిల్లెట్ మేళా

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె : కృషి విజ్ఞాన కేంద్రం, ఊటుకూరులో శనివారం చిరుధాన్యాల సమ్మేళనం (మిల్లెట్ మేళా) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెవికె సమన్వయకర్త డాక్టర్ అంకయ్య కుమార్ మాట్లాడుతూ రాగి, కొర్ర, సజ్జ, జొన్నలు వంటి చిరుధాన్యాలపైన మక్కువ పెంచుకోవాలని, ఇవి మనిషి ఆరోగ్యంగా ఉండడానికి ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. వీటిని తక్కువ ఖర్చుతో సాగు చేసి అధిక దిగుబడి, అదనపు ఆదాయం పొందవచ్చునని సూచించారు. చిరుధాన్యా లలో ఇనుము, ఖనిజ లవణాలు, పీచు పదార్థాలు అధికంగా ఉంటాయని చెప్పారు. చిరుధాన్యాల విస్తీర్ణ వ్యాప్తిలో, విలువల జోడింపులో, ఔత్సాహిక వ్యాపారులను తయారుచేయడంలో కృషి విజ్ఞాన కేంద్రం, ఊటుకూరు యొక్క పాత్రను గురించి తెలిపారు. అనంతరం చిరుధాన్యాల పంటలలోని కొత్త రకాలు, ఉత్పత్తుల ప్రదర్శన రైతులను, విద్యార్థులను ఆకట్టుకున్నాయి.

మెడికల్ కళాశాల ప్రయివేటీకరణ ఆపాలి


ప్రజాశక్తి- పులివెందుల టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరణ చేయడం దుర్మార్గమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి. మనోహర్, నాయకులు గఫూర్ శనివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. గతంలో మెడికల్ కళాశాలల ఫీజులు పెంచిన అనంతరం విద్యార్థులు పోరాటం చేసి ప్రభుత్వాన్ని గద్దె దించిన చరిత్ర విద్యార్థిలోకానికి ఉందని గుర్తు చేశారు. అధికారంలో ఉన్న ఏ ప్రభుత్వాలు అయినా ప్రయివేటీకరణ మానుకోవాలన్నారు. ట్రిపుల్ పి పేరుతో కారు చౌకగా వైద్య విద్యను బజారులో సరుకులాగా అమ్మడం అన్యాయమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగాలను పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రయివేటీకరణ చేయడం వల్ల ప్రజలనుంచి ఫీజులు రూపంలో, పన్నుల పేరుతో రకరకాల పేర్లతో వసూలు చేసే అవకాశం ఎక్కువ ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం వైద్య విద్యను మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరముందని తెలిపారు.

ఆర్‌టిపిపి ఉద్యోగుల సమ్మెలో ఉద్రిక్తత

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల : ఆర్‌టిపిపిలో ఆరు రోజులుగా తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జెఎసి ఆధ్వర్యంలో కార్మికులు, ఉద్యోగులు తమ నిరసన తెలియజేస్తూ సమ్మె బాట పట్టారు. రిలే నిరాహార దీక్షలలో శనివారం రెండవ రోజు కార్మికులు, ఉద్యోగులు కూర్చున్నారు. అయితే ఆర్‌టిపిపి మెయిన్ గేటు వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. జెఎసి ఆధ్వర్యంలో 23 యూనియన్లు కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని నిరసన తెలుపుతుండగా, మరోవైపు ఆంధ్ర రాష్ట్ర పవర్ 445, తెలుగునాడు విద్యుత్ కార్మిక యూనియన్లు సంయుక్తంగా జెఎసితో సంబంధం లేకుండా వేరుగా నిరసన తెలియజేశారు. ఈ క్రమంలో రెండు గ్రూపుల మధ్య పోటాపోటీగా నిరసనలు చేపట్టారు. ఈనేపథ్యంలో ఇరు గ్రూపుల మధ్య ఘర్షణకు దారితీసాయి. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. చర్చల అనంతరం ఇరుగ్రూపులు కలిసి జెఎస్‌పి ఆధ్వర్యంలో నిరసన తెలియజేయాలని నిర్ణయించాయి.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - బద్వేలు
విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ఎప్ప టికప్పుడూ పరిష్క రించాలని శనివారం బాధ్యతలు చేపట్టిన ఎస్‌టిఒ సురేష్‌కు రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ బద్వేల్ యూనిట్ అధ్య క్షులు శీలం గంగన్న విజ్ఞప్తి చేశారు. బద్వేల్ సబ్ ట్రెజరీ అధికారిగా నియమితులైన సురేష్‌ను కార్యాల యంలో కలసి విజ్ఞప్తి చేశారు. ఆయన్ను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌టిఒ మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు సంపూర్ణ సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ జి.వెంకట లక్ష్మమ్మ, ట్రెజరర్ సత్తిబాబు, జాయింట్ సెక్రటరీ జె గురుమూర్తి పాల్గొన్నారు.



ఎస్‌టిఒను సన్మానిస్తున్నశీలం గంగన్న

బిటెక్ 2వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి -కడప అర్బన్ : ప్రొద్దుటూరులోని వైవీయూ వైఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల పస్ట్, సెకండ్, థర్డ్ బి.టెక్ కోర్సులకు సంబంధించి రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విసి ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు శనివారం తన ఛాంబర్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మేలో బిటెక్ పరీక్షలు నిర్వహించామన్నారు. సిఎస్ఇ, ట్రిపుల్ఇ, ఇసిఇ, ఎంఎంటి, ఎంఇ ఫలితాలను విశ్వవిద్యాలయ ps:www.yvuex-ams.in results.aspx ను సందర్శించి తెలుసుకోవచ్చన్నారు.పరీక్షల విభాగాన్ని, ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రశంసించారు.

ప్రణాళికతో అద్భుతాలు సాధించొచ్చు

ప్రజాశక్తి - బద్వేలు : యువత ప్రణాళికతో ముందుకు సాగితే జీవితంలో ఎన్నో అద్భుతాలు సాధించవచ్చని హైదరాబాద్ రక్షణ ఐఎఎస్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ ఎం.మమత అన్నారు. శనివారం శ్రీ రాచపూడి నాగభూషణం డిగ్రీ అండ్ పీజీ (అటానమస్) కళాశాల, బద్వేల్‌లో వ్యక్తిత్వ వికాసం పట్ల విద్యార్థులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించే క్రమంలో ఓపికతో సిద్ధం కావాలని, కేవలం ఒక్కసారి ప్రయత్నించి విఫలం చెందితే ఇక ఉద్యోగాలు రావని వెనకడుగు వేసేవారు చాలామంది ఉన్నారని, చివరి వరకు నమ్మకంతో ప్రయత్నిస్తూ ఉండాలని ఆమె తెలిపారు. సివిల్స్, గ్రూప్స్ కు సిద్ధమయ్యే విద్యార్థులు ఆరవ తరగతి నుంచి ఎన్‌సిఇఆర్.టి పాఠ్యాంశ పుస్తకాలని అను సరించమని సలహా ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీ రాచపూడి నాగభూషణం విద్యాసంస్థల పరి పాలన అధికారి రాచపూడి వెంకట సాయి కృష్ణ, ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బాల ఓబులేసు పాల్గొన్నారు.

పశువుల ఎద లక్షణాలపై అవగాహన

ప్రజాశక్తి - వల్లూరు : పశువుల ఎద లక్షణాలపై పాడి రైతులకు అవగాహన తప్పనిసరిగా ఉండాలని కడప ఇన్‌ఛార్జి ఉపసంచాలకులు డాక్టర్ శ్రీధర్ లింగారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని చెరువు కిందపల్లెలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధక శాఖ పశుగ్రానాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. 53 ఎనుములకు, 52 దూడలకు ఏలిక పాముల మందు తాగించారు. దూడల యజమానులకు మినరల్ బ్లాక్, ఎనుముల యజమానులకు ఎముకల పొడి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల్లో లింగ నిర్ధారిత వీర్యం వల్ల ఉపయోగాలు వాటిని విరివిగా రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశువుల్లో మేలైన యాజమాన్య పద్ధతులు ఏడాదికి ఒక దూడ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో కమలాపురం సహాయ సంచాలకులు డాక్టర్ ఉత్తయ్య, వల్లూరు డాక్టర్ మారుతి ప్రతాప్ రెడ్డి, డాక్టర్ మాధవరెడ్డి, పశుసంవర్ధక శాఖ సిబ్బంది గ్రామ పాడి రైతులు పాల్గొన్నారు.

గురజాడ గృహాన్ని అధ్యయన కేంద్రంగా మార్చాలి : జెవివి

ప్రజాశక్తి - కడప అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం గురజాడ జయంతిని అధికారికంగా నిర్వహించాలని, ఆయన గృహాన్ని అధ్యయన కేంద్రంగా మార్చాలని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు సమీర్ బాష తెలిపారు. శనివారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 11వ బెటాలియన్‌లో గురజాడ అప్పారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సమీర్ బాష మాట్లాడుతూ కులాల కుమ్ములాటలు, మతాల మారణ హోమాలు, తబ్బిబ్బు రాజకీయాలతో విసిగి స్వాంతన కోరే ప్రతి భారతీయుడ్ని గురజాడ సాహిత్యం ప్రేమ గానే పలకరిస్తూనే ఉంటుందని పేర్కొన్నారు. వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహు మతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యూనస్, రామ సుబ్బారెడ్డి, సిరాజుల్ల, రవిశంకర్, పోతులూరయ్య, నరసింహులు, మౌలాలి, హేమంత్, రాజమ్మ, పరమేశ్వరి, సుమతి, సుజాత విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - కడప అర్బన్ : కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో1985-89 బ్యాచ్‌కుచెందిన పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక శనివారం ఏర్పాటు చేశారు. కెఎస్ఆర్ఎం ఫ్రెండ్స్ అసోసియేషన్, కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రయివేట్ రంగాలలో వివిధ దేశాలలో స్థిరపడిన వారు ఈ సమావేశానికి వచ్చి ఎన్నో మధురానుభూతులు పంచు కుంటూ, ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ, పాత జ్ఞాప కాలను నెమరు వేసుకుంటూ ఆద్యంతం ఉల్లాసంగా, ఉత్సా హంగా ఎంతో సందడిగా ఈ అపూర్వ కలయిక కొనసాగించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగిన ఈ కలయిక జీవితాంతం గుర్తుండిపోయేలా నిర్వహించామని పూర్వ విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ. ప్రిన్సిపల్ టి.ఎన్.ప్రసాద్, అల్యూమిని డీన్ అమర్‌నాథ్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌పిని సన్మానించిన సలావుద్దీన్

ప్రజాశక్తి - కడప అర్బన్
ఎస్‌పిగా బాధ్య తలు స్వీకరించిన నచికేత్ విశ్వనాథ్‌ను సంఘ సేవకులు, ముస్లిం సమైక్య రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్ శాలువాతో సత్కరించారు. శనివారం ఎస్ పిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ శాంతిభద్రతల్లో జిల్లాను మొద టి స్థానంలో నిలబెట్టినందుకు ప్రజలందరూ సహకరించాలని పిలుపునిచ్చారు.



ఎస్‌పిని సన్మానిస్తున్న సలావుద్దీన్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

గురజాడ అప్పారావు జయంతి కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

గురజాడ అప్పారావు 163 జయంతి సందర్భంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పట్టణంలోని కృష్ణ చైతన్య హైస్కూలులో శనివారం కరపత్రాల ఆవిష్కరించారు. ఆదివాఆరం గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా ఆయన గురించి ముద్రించిన కరపత్రాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. జెవివి రాష్ట్ర మ్యాజిక్ సబ్ కమిటీ కన్వీనర్ వి బాలబయన్న మాట్లాడుతూ సమాజంలో గురజాడ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన సమాజాన్ని మేల్కొల్పేందుకు అనేక కార్యక్రమాలు చేశారని వివరించారు. తెలుగు భాష అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. పాఠశాల కరస్పాండెంట్ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ గురజాడ అప్పారావు మహిళల అభ్యున్నతి కోసం, ఆనాటి కాలంలో ఉన్న అసమానతలు తొలగించడానికి పాటుపడ్డారని తెలిపారు. కార్యక్రమంలో జెవివి మండల ప్రధాన కార్యదర్శి ఎం రాంప్రసాద్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులు కేవీ సుబ్బయ్య, జెవివి సహాయ కార్యదర్శిలు చాంద్ బాషా, చంద్రశేఖర్‌రెడ్డి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రెడ్డి వెల్ఫేర్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రెడ్డి వెల్ఫేర్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, చైర్మన్‌ను నియ మించాలని ఆర్‌డిఒను ఆర్‌సిడిఎస్ సభ్యులు కోరారు. రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు యర్రపురెడ్డి సురేంద్రరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట సర్వోత్తమ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్‌డిఒ చిన్నయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రెడ్డి వెల్ఫేర్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.2వేల కోట్ల నిధులు కేటాయిం చాల న్నారు. రైతు లకు పాడి పరిశ్రమ, వ్యవసాయ ఆధారిత రుణాలు, మహిళల కోసం ప్రత్యేక స్వయం ఉపాధి పథకాలు కల్పించాలన్నారు. ఆర్‌సిడిఎస్ రాష్ట్ర కార్యదర్శి సిరిగిరెడ్డి రఘురామిరెడ్డి, రాష్ట్ర యువజన విభాగపు కార్యదర్శి ఒంటెద్దు నాగేశ్వర్‌రెడ్డి, కే విజయభాస్కర్‌రెడ్డి, సి.నాగిరెడ్డి, ఎం. గంగిరెడ్డి, ఒంటెద్దు ప్రభాకర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, గంగిరెడ్డి, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలి

- రాష్ట్ర చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ మహబూబ్ బాషా

చాపాడు : విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన ఉండాలని రాష్ట్ర చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ మహబూబ్ బాషా తెలిపారు. శనివారం మండల పరిధి లోని నక్కలదిన్నె ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సంద ర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో పలు అంశాల పట్ల ముచ్చ టించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు అన్ని రకాల వసతులు ప్రభుత్వ పాఠశాలలో అందు తున్నాయన్నారు. ప్రభుత్వం అం దుకు అనుగుణంగా వసతులు ఏర్పాటు చేస్తోం దన్నారు. తరగతిలో వెనుక బడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకో వాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందివాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు రవిశంకర్, వంశీకృష్ణ ఉపాధ్యాయులు శోభన్‌బాబు, కృష్ణయ్య, రూరల్ సీఐ శివ శంకర్ యాదవ్, ఎస్ఐ చిన్న పెద్దయ్య, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చలో గుంటూరును జయప్రదం చేయండి

చాపాడు(మైదుకూరు) : వనిపెంట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఛలో గుంటూరు రణభేరిని జయప్రదం చేయాలని యుటిఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. ఆ మేరకు శనివారం వారు గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహా అధ్యక్షులు వై. రవికుమార్, యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, వనమాల రాము, జయచంద్ర, లక్ష్మీదేవి, చంద్రకళ, రామిరెడ్డి, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ప్రొద్దుటూరులో కిడ్నాప్ కలకలం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరులో శనివారం కిడ్నాప్ కలకలం రేపింది. ప్రొద్దుటూరు శివారు ప్రాంతమైన బొల్లవరానికి చెందిన వేణుగోపాల్‌రెడ్డిని కిడ్నాప్ చేశారు. భార్య ప్రమీల దేవి, కుమార్తె స్వప్న కథనం మేరకు వివరాలు. వేణుగోపాల్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం త్వరలో వస్తానని బయటికి వెళ్లారు. రాత్రి అయినా రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేశారు. ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో ఆందోళన మొదలైంది. పోలీసులకు సమాచారం అందించారు. వేణుగోపాల్‌రెడ్డి వడ్డీ వ్యాపారం చేస్తున్నారు. వేణుగోపాల్‌రెడ్డిని లక్ష్మిరెడ్డి, ప్రతాపరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి కిడ్నాప్ చేసి ఉంటారని అనుమానాన్ని కుటుంబ సభ్యులు వ్యక్తం చేశారు. వాస్తవ్ ద్వారా ఇంటి పరిసరాలను గాలించారు. కిందపడిన స్కూటర్, వదిలిన చెప్పులు, స్కూటర్‌పై కారంపొడి కనిపించిందని ఫిర్యాదు దారులు తెలిపారు. కళ్లలో కారంపొడి చల్లి కిడ్నాప్ చేసి ఉంటారని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

దొంగతనం కేసులో బంగారు నగలు రికవరీ

ప్రజాశక్తి - వేంపల్లె : స్థానిక పంచాయతీ పరిధిలోని పిల్ల స్వామి గుట్ట సమీపంలో ఉన్న జగనన్న కాలనీలోని ఓ ఇంట్లో జరిగిన చోరీ కేసులో బంగారు నగలు రికవరీ చేసినట్లు సిఐ నర్సింహులు తెలిపారు. చోరీకి పాల్పడిన ఇద్దరు మైనర్లను, మరొకవ్యక్తిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 18న జగనన్న కాలనీలో బీగాలు వేసి ఉన్న వాని అనే మహిళ ఇంటికి అదే కాలనీకి చెందిన ఖాదర్ వలితోపాటు మరో ఇద్దరు మైనర్లు పట్ట పగలే బీగాలు పగులగొట్టి ఇంటిలోకి ప్రవేశించినట్లు సిఐ తెలిపారు. ఇంట్లో ఉన్న బీరువాను పగులగొట్టి అందులో ఉన్న బంగారు నగలు, వెండిని దొంగిలించినట్లు వివరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు పులివెందుల డిఎస్‌పి మురళి నాయక్ ఆధ్వర్యంలో శనివారం వేంపల్లె పరిధిలోని కడప - పులివెందుల బైపాస్ రోడ్డులోని హనుమాన్ జంక్షన్ వద్ద నిందితులను తాను, ఎస్ఐ తిరుపాల్ నాయక్, పోలీసు సిబ్బంది అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద ఉన్న బంగారు, వెండిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుల నుండి 33.800 గ్రాముల లాంగ్ చైన్, 20.200 గ్రాముల 2 ఫ్యాన్సీ చైన్, 4.500 గ్రాముల పచ్చరాయి ఉంగరం, 700 మిల్లి గ్రాముల చిన్న పిల్లల కమ్మలు, 400 మిల్లి గ్రాముల కమ్మలు, 118 గ్రాముల వెండి గొలుసులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మొత్తం బంగారు 66.900 గ్రాముల ఆభరణాలు, 118 గ్రాముల వెండి గొలుసులు నిందితుల నుండి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

తల్లిదండ్రుల చెంతకు ఇద్దరు బాలురు

ప్రజాశక్తి - కడప అర్బన్ : కడప తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో తప్పిపోయిన ఇద్దరు బాలురను పోలీసులు కేవలం గంటల్లో వారి ఆచూకీ కనుగొని తల్లిదండ్రులకు అప్పగించారు. సిఐ టి.రెడ్డప్ప వివరాల మేరకు. నగరంలోని బిలీవ్ సర్కిల్ వద్ద ఉన్న సాయిబాబా స్కూల్‌లో 8 వ తరగతి చదువుతున్న టి. కౌశిక్ కుమార్ రెడ్డి, ఎస్.ప్రణయ్ సాయి రెడ్డి ఇద్దరు స్నేహితులు. శుక్రవారం మధ్యాహ్నం 1:28 గంటలకు స్కూల్ నుంచి వెళ్లిపోయినట్లు, ఎంత వెదికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో తల్లిదండ్రులు, స్కూల్ యాజమాన్యం తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని వివరించారు. కడప డిఎస్‌పి ఎ.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో సిబ్బందిని బృందాలుగా ఏర్పాటు చేసి నగరం నలుమూలల గాలింపు చర్యలు చేపట్టారు. కీలకమైన ఆధారాలను సేకరించి కేవలం గంట వ్యవధిలోనే విద్యార్థులను తిరుపతి రైల్వే స్టేషన్‌లో ఉన్నట్లు గుర్తించారు. పోలీస్ సిబ్బందిని తక్షణమే తిరుపతి రైల్వేస్టేషన్‌కు పంపి విద్యార్థులను సురక్షితంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చారు.

సైలెన్సర్‌ను మారిస్తే క్రిమినల్ చర్యలు : డిఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్ : ద్విచక్ర వాహనాలకు కంపెనీతో వచ్చిన సైలెన్సర్లను మార్పు చేసే వాహనదారులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. శనివారం కోటిరెడ్డి సర్కిల్ వద్ద ఉన్న ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎదుట శబ్ద కాలుష్యం చేసే ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను రోడ్ రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు శబ్ద కాలుష్యం చేస్తూ తిరుగుతున్న వాహనదారులపై ఉక్కు పాదం మోపామని పేర్కొన్నారు. ట్రాఫిక్ సిఐ జావిద్, ఎస్ఐ జయ రాములు, ట్రాఫిక్ సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ధ్వని కాలుష్యం చేసే వాహనాలను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. 50 వాహనాల సైలెన్సర్లను ధ్వంసం చేశామని చెప్పారు.

వర్షంతో వేలాదిమందికి ఉపాధి కరువు

పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు - నిలిచిపోయిన రాకపోకలు



నాపరాయి పరిశ్రమలోకి చేరిన వర్షపునీరు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండల వ్యాప్తంగా నాపరాయి గనులు, పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు ఉపాధి కరువైంది. అధిక వర్షాలతో గనులు, పరిశ్రమల్లోకి నీరు చేరింది. అవి నీట మునిగియి. నాపరాయి మిషన్లలో వర్షపు నీరు చేరి పనులు నిలిచిపోయాయి. శనివారం వై.కోడూరు వద్ద ఉన్న వంక ఉధృతంగా ప్రవహిస్తుడడంతో వేం పల్లి రోడ్డులో రాకపోకలు నిలిచిపోయాయి. మాలెపాడు వద్ద ఉన్న వంక కూడా ఉధృతంగా ప్రవహిస్తోంది. పంట పొలాల్లో వర్షపు నీరు అంతా పెద్ద ఎత్తున నిలిచిపోయింది. ఇంతటి వర్షాన్ని కొన్నేళ్లుగా తాము చూడలేదని స్థానికులు చెబుతున్నారు. ప్రకాష్ నగర్, పోలీస్‌స్టేషన్ వెనకాల వీధులు, ఎస్టేట్, వేంపల్లి రోడ్డులోని విద్యుత్ కార్యాల యంతోపాటు పలు ప్రాంతాలు జలమయమ య్యాయి. రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. లోతట్టు ప్రాంతాలన్నీ వర్షపు నీటితో మునిగిపోయాయి.



ప్రకాష్‌నగర్‌లో ఇంట్లోకి చేరిన నీరు

స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర ప్రదేశ్‌కు కృషి చేయాలి



మొక్కలు నాటుతున్న ఎంపిడిఒ రాధాకృష్ణవేణి

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించి స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర ప్రదేశ్‌కు కృషి చేయాలని ఎంపిడిఒ రాధాకృష్ణవేణి సూచించారు. స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలోని సచివాలయంలో శనివారం ఎంపిడిఒ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్రపై అవగాహన సమావేశం నిర్వహించారు. మొక్కల పెంపకం, అడవుల సంరక్షణ పెంపొందించడం, పరిశుభ్రత, పర్యావరణ స్థిరత్వంపై అవగాహన కల్పించారు. అనంతరం పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ వీరభద్రుడు, కార్యదర్శి లక్ష్మి నరసింహులు, ఎపిఒ గంగయ్య, ఎపిఎం అపర్ణ, సిసి ఇబ్రహీం, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు విశాలాక్షి, లక్ష్మీదేవి, ప్రధానోపాధ్యాయులు రాజ్యలక్ష్మి, సచివాలయ, పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, మహిళలు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం తప్పనిసరి అని పులివెందుల డిఎల్‌డిఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. శనివారం మండలంలోని గురజాలలో కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛంధ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా ఒక మొక్కను నాటి దాన్ని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీని వాస్‌రెడ్డి, ఉపాధి హామీ ఏపీవో విజయభారతి, ఈసీ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న డిఎల్‌డివో విజయలక్ష్మి

ఖాజీపేట : ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని సర్పంచ్ కొంగాని వెంకటసుబ్బయ్య యాదవ్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని భూమాయపల్లె సచివాలయం వద్ద స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అడవుల విస్తీర్ణం తగ్గుతుండడం వల్ల వర్షాలు లేక కరువు పరిస్థితులు ఎదురవుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షిస్తే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్నరు. కరువు పరిస్థితులు ఉత్పన్నం కావని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేముల : మండలంలోని అన్ని గ్రామాల్లో అధికారులు శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి, ఆయన సోదరుడు పేర్ల శేషారెడ్డి పాల్గొన్నారు. వేములలో మండల అధికారులు, సిబ్బంది మండల పరిషత్ కార్యాలయం నుండి అవగహన ర్యాలీ ప్రారంభించారు. రోడ్లపై చెత్త వేయరాదు.. తడిచెత్త పొడిచెత్త వేరు చేయాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకం వద్దు-కాటన్ ముద్దు అనే ప్లకార్డులతో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఎంపీడీవో కార్యాలయం నుంచి మెయిన్ బజార్ మీదుగా ర్యాలీ చేశారు. తదనంతరం సచివాలయం ప్రాం గణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపిడిఒ గంగాదేవి, వెలుగు ఎపిఎం ఆంజనేయులు, ఉపాధి హామీ ఈసీ మధుసూదన్‌రెడ్డి, మండల సమాఖ్య, వైద్య, సచివాలయాలు, ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



ర్యాలీలో మండల అధికారులు, నాయకులు

చాపాడు : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలని నక్కలదిన్నె వైద్యాధికారి కావ్య మాధురి తెలిపారు. శనివారం నక్కల దిన్నె పిహెచ్‌సి పరిధిలో స్వచ్ఛ ఆంధ్రా-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన ఇంటితో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఎం. రాఘవయ్య, సూపర్వైజర్ టి.ప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పి కీర్తి, ఎఎన్ఎంలు శోభారాణి, వనజ, ఆరోగ్య మేరీ, ఆశా కార్యకర్త సావిత్రి, ప్రజలు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న వైద్యాధికారి కావ్య మాధురి

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా రాణి తిరుమల దేవి డిగ్రీ కళాశాలలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. కళాశాల కరస్పాండెంట్ తరుణ్ ఇంద్రశేఖర్, ప్రిన్సిపల్ టి.చంద్రశేఖర్ రెడ్డి, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్.వెంకటేశ్వర రెడ్డి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్, స్వచ్ఛ పులివెందుల మనందరి బాధ్యత అని పులివెందుల మునిసిపల్ కమిషనర్ రాముడు పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలో ఆకుపచ్చ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా డ్వామా కార్యాలయ ప్రాంగణంలో దాదాపు 600 మొక్కలు నాటే కార్యక్రమం మునిసిపల్ కమిషనర్, మునిసిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, రాష్ట్ర హజ్‌హౌస్ డైరెక్టర్ మహబూబ్ బాషా, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు ప్రారంభించారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ పులివెందుల ప్రతిజ్ఞ చేశారు. మున్సిపల్ పరిధిలోని రింగ్ రోడ్లు శుభ్రం చేశారు. రోడ్లకు ఇరు వైపులా చెత్త చెదారాలు, పిచ్చి మొక్కలు తొలగించారు. కో-ఆప్షన్ మెంబెర్ చంద్రమౌళి, కౌన్సిలర్లు ఖాదర్, రాజశేఖర్‌రెడ్డి, డ్వామా సిబ్బంది, మునిసిపల్ డిఇలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



రోడ్లపై చెత్తను ఊడుస్తున్న మున్సిపల్ కమిషనర్, సిబ్బంది

బస్సు సర్వీసు లేక ఇబ్బందులు

ప్రజాశక్తి - తొండూరు

మండలంలోని ఉదవగండ్ల, చెర్లోపల్లి, పోతలపల్లి, సోంపల్లి గ్రామాలకు రవాణా సౌకర్యం లేక వారు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఆ అసౌకర్యంతో వారంతా దూరప్రాంతవాసుల్లా మారిపోయాయి. 2013లో ఆర్టీసీ బస్సులు రోజుకు మూడు సార్లు తిరిగేవి. ఆ సర్వీసులు రద్దు చేసిన తర్వాత ప్రజలు నానా కష్టాలు పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, రోగులు పులివెందుల, ముద్దనూరు వెళ్లాలంటే 18 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోంది. బస్సులు లేక నరకయాతన అనుభవిస్తున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల పరిస్థితి మరీ దారుణంగా ఉందని వాపోయారు. కూలీలు, చిన్న వ్యాపారులు కూడా పనుల కోసం పట్టణాలకు వెళ్లడంలో ఇబ్బందులు పడుతున్నారు. ఆయా పల్లెల్లో మహిళలు అధికంగా ఉన్నందున వీరికి కూడా ఆర్‌టిసి ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. బస్సు సర్వీసు పునరుద్ధరణతోపాటు వృద్ధులు, విద్యార్థులు, మహిళలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నత స్థాయికి చేరడానికి విద్య చాలా అవసరం

జమ్మలమడుగు రూరల్ : ఉన్నతస్థాయికి చేరడానికి విద్య చాలా అవసరమని డిఎస్పీ భావన తెలిపారు. శనివారం ప్రొద్దుటూరు మడలంలోని గౌతమి మహిళా ఇంజి నీరింగ్ కళాశాలలో ఫ్రెష ర్స్ డే వేడుకలు ప్రిన్సిపల్ రామసుబ్బమ్మ అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ పూతి భావన మాట్లాడుతూ ప్రతి ఒక్కరి విద్యార్థి దశలో ఫ్రెషర్స్ డే వేడుకలు చాలా ప్రత్యేకమన్నారు. తన విద్యార్థి దశలో జరిగిన కార్యక్రమాలను ఆమె స్మరించుకున్నారు. నేటి సమాజంలో మహిళలు ఉన్నతస్థాయిలో నిలబడడానికి విద్య చాలా అవసరమన్నారు. తన జీవితంలో ఎదుర్కొన్న ఒడిదు డు కులు, తన ఉద్యోగ జీవితంలో జరిగిన విశేషాలను వివరించారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించుకొనుటకు తగు సూచనలు చేశారు. కో డైరెక్టర్ శైలూష మాట్లాడుతూ ప్రతి విదార్థిని డిఎస్పీ భావనను ఆదర్శంగా తీసు కోవాలన్నారు. కళాశాల కర స్పాండెంట్ బాబమ్మ, డైరెక్టర్లు నాగూర్, రవీంద్రారెడ్డి, డిప్లొమా కళాశాల ప్రిన్సిపల్ ప్రకాష్ రావు, వివిధ విభాగ అధిపతులు మహమ్మద్, జాంబీర్, యాకూబ్, విజయమ్మ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

లోక కల్యాణ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

పులివెందుల రూరల్ : లోక కల్యాణ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని మెప్మా పీడీ కిరణ్‌కుమార్ కోరారు. పులివెందుల బిఎస్ఎన్ఎల్ కార్యాలయ సమీపంలో శనివారం ఏర్పాటు చేసిన పిఎం స్వానిధి లోక కల్యాణ్‌కు విశేష స్పందన లభించింది. పులివెందుల చిరు వ్యాపారస్తులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథులుగా మున్సిపల్ కమిషనర్ రాముడు, హరిప్రసాద్ రెడ్డి, హజ్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాషా, పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్ యాదవ్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అజయ్ కుమార్, సిఎంఎం నాగలక్ష్మి, సిఒ రామాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిరు వ్యాపారులకు పిఎం స్వానిధి ద్వారా చేకూరే లబ్ధి గురించి వివరించారు. కార్యక్రమంలో స్నేహిత అమృతహస్త సేవా సమితి అధ్యక్షులు రాజు, స్థానిక బ్యాంకుల అధికారులు, ఆర్పీలు, మహిళలు, వీధి వ్యాపారులు, చిరు వ్యాపారులు పాల్గొన్నారు.



క్రీడల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు


చిన్న గురువలూరు హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని చిన్నగురువలూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు జిల్లాస్థాయిలో నిర్వహించిన పలు క్రీడల్లో ఉత్తమ ప్రతిభ చూపారని ప్రధానోపాధ్యాయులు నాగరాజు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పాఠశాలకు చెందిన 22 మంది విద్యార్థులు స్విమ్మింగ్, సైక్లింగ్, ఫెన్సింగ్, షూటింగ్, రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్, టెన్నిస్ జిల్లా గేమ్స్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. క్రీడల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపడం పట్ల ఆయన అభినందించారు. విద్యార్థులను క్రీడల్లో రాణించేందుకు శిక్షణనిచ్చిన పీడీ వినోనియారాణిని, విద్యార్థులను అభినందించారు.

భువనేశ్వరిని కలిసిన జడ్‌పిటిసి లత

ప్రజాశక్తి - పులివెందుల రూరల్



ఉండవల్లిలోని సీఎం చంద్రబాబు నివాసంలో ఆ యన సతీమణి నారా భువనేశ్వరిని శని వారం పులివెందుల జడ్‌పిటిసి సభ్యురాలు లత మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఆమె భువనేశ్వరిని ఘనంగా సన్మానించారు. పులివెందుల రాజకీయ పరిస్థి తులపై భువనేశ్వరి చర్చించారు. కార్యక్రమంలో బీటెక్ రవి, వ్యక్తిగత పిఎ నాగార్జున, భాషా పాల్గొన్నారు.

నేడు వేంపల్లెలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక శ్రీచైతన్య పాఠశాల ఆవరణలో ఆదివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు కడప పట్టణానికి చెందిన శ్రీబిందు హాస్పిటల్, తిరుపతికి చెందిన శ్రీవెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరం మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి తెలిపారు. కీళ్లు, ఎముకలు, నరముల సమస్యలతో బాధపడుతున్న వారిని పరీక్షిస్తారన్నారు. కంటి పరీక్షలు కూడా చేస్తారన్నరు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

238 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - లింగాల

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, రోగులకు మందులు పంపిణీ చేశారు. స్వస్త్ నారీ సశక్త్ పరివార్ ఆరోగ్య శిబిరాన్ని శనివారం డిప్యూటీ డిఎంహెచ్ఓ ఖాజామొద్దీన్, వైద్య అధికారి గౌతమి ప్రారంభించారు. కంటి పరీక్షలు, టిబి, లెప్రసీ, గైనకాలజిస్ట్, డెర్మటాలజిస్ట్, జనరల్ ఫిజీషియన్ వైద్యులు పలు పరీక్షలు నిర్వహించారు. గర్భిణులకు స్కానింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు ప్రసన్నకుమార్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్, ఎన్ఎంస్, అశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో 22 నుంచి దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

దసరా ఉత్సవాల నిర్వహణలో రెండవ మైసూరుగా పేరుగాంచిన ప్రొద్దుటూరులో ఈనెల ఈనె 22 నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆర్యవైశ్యసభ అధ్యక్షులు రామ్మోహన్‌రావు తెలిపారు. అమ్మవారిశాలలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 136వ దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయన్నారు. ఈనెల 22న ప్రారంభమై అక్టోబర్ 3న ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు.

జీతాలు ఇవ్వాలంటూ పారిశుధ్య కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - వేంపల్లె

తమకు జీతాలు ఇవ్వాలంటూ పారిశుధ్య కార్మికులు శనివారం వేంపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా కార్మికులు చెవ్విలో పువ్వు పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. తమకు ఐదు నెలలుగా జీతాలను ఇవ్వలేదన్నారు. తమ కుటుంబాలు రోడ్డున పడినట్లు కార్మికులు వాపోయారు. పని చేయించుకోవడం తప్ప, కార్మికులకు జీతాలు ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. జీతాలు రాక పోవడంతో దసరా పండుగ రోజు కూడా పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొందని అవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు గత పది రోజులుగా వేతనాలు అదిగో.. ఇదిగో అంటూ అధికారులు కాలయాపన చేయడం సరికాదన్నారు. స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ ప్రచార ఆర్భాటలపై ఉన్న శ్రద్ధ కార్మికులకు వేతనాలు చెల్లించడంలో ఎందుకు లేదని వారు అధికారులను ప్రశ్నించారు. జీతాలు చెల్లించక పోవడంతోపాటు 15 నెలల పిఎఫ్ డబ్బులు కూడా ఇవ్వలేదన్నారు.